నమస్తే తెలంగాణ
సిద్ధిపేట
I హైదరాబాద్, శుక్రవారం 29 నవంబర్ 2024 SIDDIPET

కేసీఆర్ పోరాటంతోనే
తెలంగాణ సాకారం

- మలిదశ ఉద్యమంలో ముందున్న సిద్దిపేట గడ్డ
- గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 28: కేసీఆర్ పోరాట స్ఫూర్తితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే నవంబర్ 29కి ప్రత్యేకత ఉందని, నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం చేపట్టిన పోరాటంతోనే రాష్ట్రం వచ్చిందన్నారు. కేసీఆర్ చేపట్టిన సుదీర్ఘ పోరాటంతోనే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణకు మద్దతిచ్చాయన్నారు. బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన చిన్న రాష్ట్రాల అంశంతో కేసీఆర్ 2001 నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేశారన్నారు. సిద్దిపేట గడ్డమీద కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షను అప్పటి ప్రభుత్వం భగ్నం చేసిందన్నారు. అయినా కేసీఆర్ వెనుకడుగు వేయకుండా పోరాటం చేశారన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసిందంటే కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష ఫలితమే అన్నారు. కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా ఎంతో మంది విద్యార్థులు, ఉద్యమకారులు, ఉద్యోగులు అండగా నిలబడ్డరన్నారు. నేడు సిద్దిపేట జిల్లా కేంద్రంలో చేపట్టే దీక్షదివస్‌కు ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, తెలంగాణ వాదులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఉదయం 9.30 గంటలకు రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, అమరులైన వారిని స్మరించుకోవాలని పిసుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు జుబెర్ పాషా, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు బెండే మధు, నవాజ్‌మీరా, నూనె కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, అర్జున్ గౌడ్, మల్లేశం, రామచంద్రం, రామకృష్ణ రెడ్డి, రమేశ్ గౌడ్, స్వామిచారి, నరేశ్, శివకుమార్, అహ్మద్, నర్సింహులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిరావాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, నవంబర్ 28: మెదక్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉద్యమ నాయకులు, యువకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమ నాయకుడు కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ సాధించారన్నారు. 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన సందర్భంగా దీక్షను మరోసారి గుర్తుచేసుకోడానికి పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్‌హుస్సేన్, నర్సింహులు, జీవన్‌రెడ్డి, ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు సేనాధిపతి, రవికుమార్, వెంకటేశ్ గౌడ్, శ్రీశైలం, సామ్యానాయక్, ఉమ్లానాయక్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో మాట్లాడుతున్న సునీతాలక్ష్మారెడ్డి

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే పల్లా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

మద్దూరు (ధూళిమిట్ట), నవంబర్ 28: ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం జనగామలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన గొడుగు జంపన్న, పోతిరెడ్డి శ్రీనివాస్‌తోపాటు పలువురికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్, బీఆర్ఎస్ నాయకులు యాకూబ్ గౌడ్, గంగుల సత్తయ్య, తుపాకుల సత్తయ్య, మెతుకు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి రారు.. పనులు చేయరు..

సమయపాలన పాటించని రాయపోల్ రెవెన్యూ సిబ్బంది

సిద్దిపేట జిల్లా రాయపోల్ తహసీల్ కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

- చెట్ల కింద పడిగాపులు కాస్తున్న ప్రజలు
- 11 గంటలు దాటినా ఖాళీ కుర్చీలే దర్శనం

రాయపోల్, నవంబర్ 28: రాయపోల్ రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పాటు పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు చెట్ల కింద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. రోజూ 11 గంటల తర్వాత కార్యాలయానికి వచ్చి ప్రజా సమస్యలు పట్టించుకోకుండా వారి పనులు చూసుకొని తీరిగ్గా ప్రజా సమస్యలపై స్పందిస్తారు. అప్పటికప్పుడు పరిష్కరించే పనులను కూడా రోజుల తరబడి ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఉదయం 10:30 గంటలకు రావాల్సిన అధికారులు అంతా.. మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రాయపోల్ రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ నుంచి కిందిస్థాయి సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదు. రోజుల తరబడి 11 గంటలు దాటినా అధికారులు మాత్రం కార్యాలయానికి రావడం లేదు. 12 గంటలు దాటిన తర్వాత ఒక్కొక్కరు కార్యాలయానికి చేరుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కేంద్రంలో గురువారం జరగనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 2001లో నా స్వప్నం.. నా ధ్యేయం తెలంగాణ సాధనే అని బయలుదేరిన కేసీఆర్.. 2009 నవంబర్ 29న కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో ప్రాణత్యాగానికి సిద్ధపడి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. 14 ఏండ్లు అలుపెరుగని పోరాటంతో ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై ప్రత్యర్థులు దుర్మార్గంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక పాలనకు శరమగీతం పాడాలని సూచించారు. ఏడాది తిరకగముందే కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి యువత తరలివచ్చి దీక్షా దివస్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉద్యమానికి నాంది.. దీక్షా దివస్

యావత్తు తెలంగాణ జాగృతమైన దినం.. 2009 నవంబర్ 29 ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన రోజు

- ఉద్యమాన్ని ఒంటి చేత్తో నడిపిన ఉద్యమ రథసారథి కేసీఆర్
- 11 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ధీరుడు
- డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ఇస్తున్నట్లుగా ప్రకటన
- గాంధేయ మార్గంలో పోరాడి గల్లీ నుంచి ఢిల్లీ వరకు జనాన్ని కదిలించిన ఉద్యమ రథసారథి
- ఉద్యమంలో యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని కదిలించిన సిద్దిపేట, రంగధాంపల్లి దీక్షా శిబిరాలు
- 1531 రోజులపాటు నిర్విరామంగా కొనసాగిన సిద్దిపేట, పాలమాకుల దీక్షలు
- లోక్‌సభలో 2014 ఫిబ్రవరి 18న, రాజ్యసభలో ఫిబ్రవరి 20న తెలంగాణ ఏర్పాటుకు ఆమోద ముద్ర
- మార్చి 1న అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ రాజముద్ర
- 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం
- తెలంగాణ ప్రజల హృదయాల్లో కలకాలం పదిలంగా కేసీఆర్

తెలంగాణ ఉద్యమ దశదిశను మార్చిన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష

సిద్దిపేట (నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి), నవంబర్ 28: మలిదశ తెలంగాణ ఉద్యమంలో మరో ప్రస్థానం.. అత్యంత కీలకమైన రోజు.. యావత్తు తెలంగాణ జాగృతమైన దినం... నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలను ఉద్యమంలో నడిచేందుకు ఊపిరిలూదిన రోజు.. తెలంగాణ ప్రజలను ఐక్యం చేసి ఏకతాటిపై తీసుకొచ్చి ప్రత్యర్థులకు ఉద్యమ రుచి చూపిన దినం 2009 నవంబర్ 29. తెలంగాణ ఉద్యమ రథసారథి.. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన దినం. ఈ దీక్ష తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ఇస్తున్నట్లుగా ప్రకటన వెలువడిన తర్వాత 11 రోజుల దీక్షను కేసీఆర్ విరమించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఒంటి చేత్తో నడిపిన నాటి ఉద్యమ రథసారథి కేసీఆర్. తెలంగాణ ఉద్యమంలో ఎలాంటి హింసకు తావులేకుండా.., శాంతియుతంగా.., గాంధేయ మార్గంలో పోరాడి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు జనాన్ని కదిలించి.., ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన ధీరుడు మన కేసీఆర్. ఆనాటి ఉద్యమ సమయంలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు.. ఇప్పటికీ జనాల హృదయాల్లో పదిలంగా ఉన్నాయి. చరిత్రలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్ర సాధన కోసం 42 రోజుల పాటు చేపట్టిన సకల జనుల సమ్మెతో పాలన స్తంభించింది. 14ఎఫ్ రగడ.. తెలంగాణ ఉద్యమ దశను దిశను మార్చి ఉద్యమానికి నాంది పలికి ఒక ప్రభంజనంలా సృష్టించింది.. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితం. హైదరాబాద్ నగరాన్ని ఆరో జోన్ నుంచి వేరు చేస్తూ ఫ్రీజోన్ మార్చేందుకు తీసుకున్న నేపథ్యంలో కేసీఆర్ తీసుకున్న 14ఎఫ్ రగడ సంచలన నిర్ణయానికి నాంది పలికింది. ఆరవై ఎండ్లుగా తెలంగాణ ప్రజలు అణిచివేతలో గురవుతున్న పరంపరలో ఫ్రీజోన్ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి తెలంగాణ ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి తెచ్చింది.

ఉద్యమాల పురిటిగడ్డ సిద్దిపేట

ఫ్రీజోన్.. కాదురా.. హైదరాబాద్ మాదిరా.. పేరిట 14ఎఫ్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యోగ గర్జన భారీ బహిరంగ సభ కేసీఆర్ సంచలన నిర్ణయానికి ఉద్యమాల పురిటిగడ్డ సిద్దిపేట వేదికైంది. ఈ సభలో కేసీఆర్ తెలంగాణ కోసం తాను 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమైనట్లు సంచలన వాఖ్యలు చేశారు. అనంతరం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు కరీంనగర్ నుంచి బయలు దేరి సిద్దిపేట దీక్షా స్థలానికి చేరుకుంటున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించడంతో సిద్దిపేటలోని రంగధాంపల్లి వద్ద ఆమరణ నిరాహార దీక్ష స్థలిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసీఆర్ అరెస్టు వార్త విన్న వెంటనే సిద్దిపేటలోని రంగధాంపల్లి దీక్షా శిబిరంలో అలజడి మొదలైంది.. కేసీఆర్ అరెస్టు వార్త తెలుసుకున్న వెంటనే ఆయన స్థానంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, దివంగత నేత సోలిపేట రామలింగారెడ్డి, ఇతర పార్టీ నేతలతో కలిసి దీక్ష చేపట్టారు. అప్పటికే దీక్షా స్థలి వద్ద భారీగా మోహరించిన పోలీసు బలగాలు బారికేడ్లను బద్దలు కొట్టి దీక్షా ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఓవైపు పోలీసులు లాఠీలు.. మరోవైపు జై తెలంగాణ నినాదాలతో రంగధాంపల్లి దీక్షా శిబిరం మార్మోగించారు. కొన్ని నిమిషాల వ్యవధిలో దీక్షాప్రాంగణం ఉద్రిక్త పరిస్థితుల నడుమ కొనసాగింది. అసలేం.. జరుగుతుందో.. తెలుసుకునే లోపే బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, తెలంగాణ వాదులను ఒక్కొక్కరిగా అరెస్టు చేశారు. పోలీసులు భారీగా శిబిరం ప్రాంగణంలోకి దూసుకొచ్చి హరీశ్‌రావు సహా ముఖ్య నాయకులను అరెస్టు చేసి వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ విద్యార్థిలోకం, ఉద్యమకారులు, అమరులు నిరంతరం తమ వాణిని వినిపించారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ముక్త కంఠంతో ఆంధ్రోళ్లతో కొట్లాడితే ఆమరణ దీక్ష అనంతరం ఐదేండ్లకు తెలంగాణ రాష్ట్ర సంకల్పం సిద్ధించింది. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం యూపీఏ పరిణామాలు, ఉత్కంఠ నడుమ వాయిదాలపై ఊరిస్తూ అఖిలపక్ష తీర్మానాలు చేయించి లోక్‌సభలో 2014 ఫిబ్రవరి 18న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. రాజ్యసభలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణకు ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు మార్చి 1న అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజముద్ర వేశారు. తదనంతరం తెలంగాణలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడంతో అదేరోజు తెలంగాణ ఉద్యమ రథసారథి, తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్ర సీఎంగా ఎన్నికయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారు. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైంది. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండి పడుతున్నారు. మళ్లీ కేసీఆర్ చేతిలోనే తెలంగాణ రాష్ట్రం ఉండాలని ప్రజలు విశ్వసిస్తున్నారు. గ్రామాల్లో కేసీఆర్ సార్ కావాలని కోరుకుంటున్నారు.

సిద్దిపేట, పాలమాకులలో చారిత్రాత్మక దీక్షలు

కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను సీమాంధ్ర ప్రభుత్వం కుట్రలు పన్ని పోలీసులతో భగ్నం చేయడంతో ఒక్కసారిగా తెలంగాణ యావత్తు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నది. చరిత్రలో నిలిచిపోయే విధంగా దీక్షలు జరిగాయంటే అది ఉద్యమ పురిటిగడ్డ సిద్దిపేట దీక్షా శిబిరం. మరొకటి నంగునూరు మండలం పాలమాకుల దీక్షా శిబిరం అని చెప్పవచ్చు. నిత్యం జనసమర్థం ఉండే అంబేద్కర్ సర్కిల్‌లోని పాత బస్టాండ్ వెనుక భాగంలో దీక్షా శిబిరం వేదికను హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 1531 రోజుల పాటు నిర్విరామంగా దీక్షలు కొనసాగాయి. దీక్షా స్థలికి ఎంతోమంది మేధావులు, నాయకులు, ప్రముఖులు వచ్చి సంఘీభావం తెలిపారు. కేసీఆర్ పలుసార్లు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపి మాట్లాడారు. దీక్షలో సిద్దిపేట పట్టణంతో పాటు సిద్దిపేట, చిన్నకోడూరు మండలాలకు చెందిన మహిళా సంఘాలు, జేఏసీ నాయకులు కూర్చుని విజయవంతం చేశారు. పాలమాకుల దీక్షా శిబిరం వెయ్యి రోజులపాటు కొనసాగింది. ఈ దీక్షలో సుమారుగా 16 వేల మంది మహిళలు కూర్చుని రాష్ట్రం వచ్చేదాకా నినదించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మార్చి 13న సిద్దిపేట దీక్షలు మార్చి 9న పాలమాకుల దీక్షలను విరమింపజేశారు. సిద్దిపేటలో 1531 రోజుల పాటు దీక్షా స్మృతులకు గుర్తుగా పైలాన్ నిర్మించారు.

రంగధాంపల్లి దీక్షాస్థలి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ కార్యకర్తలు (ఫైల్)

నేడు సంగారెడ్డిలో దీక్షా దివస్

- కేసీఆర్ ఆమరణ దీక్ష స్ఫూర్తి అన్నివర్గాలకు తెలిసేలా నిర్వహణ
- హాజరుకానున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కందిలో దీక్షా దివస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, (నమస్తే తెలంగాణ)/కంది, నవంబర్ 28: తెలంగాణ సాధన కోసం ప్రాణాలు పణంగా పెట్టి కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష స్ఫూర్తి అన్నివర్గాలకు తెలిసేలా శుక్రవారం సంగారెడ్డిలో దీక్షా దివస్‌ను నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ సాధన కోసం 29 నవంబర్ 2009న ఆమరణ దీక్ష చేపట్టారు. కేసీఆర్ సచ్చుడో..తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో కేసీఆర్ చేపట్టిన దీక్ష తెలంగాణ సాధనకు మార్గమైంది. కేసీఆర్ దీక్షా ఫలితంగా ఢిల్లీ సర్కార్ తెలంగాణపై ప్రకటన చేసింది. కందిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన దీక్షా దివస్ జరుగనున్నది. దీక్షాదివస్‌కు పార్టీ పరిశీలకుడు దేవీప్రసాద్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డితోపాటు జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. మొదట సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేయనున్నారు. అనంతరం కందిలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు క్షీరాభిషేకం చేస్తారు. కేసీఆర్ చేపట్టిన దీక్షకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. దీక్షాదివస్‌కు ఐదు నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు. దీక్షా దివస్ ఏర్పాట్లను గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరిశీలించారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధించండి

- మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్

హోటల్ యజమానులకు సూచనలిస్తున్న జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్

రామాయంపేట, నవంబర్ 28: రామాయంపేట పురపాలికలో ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధించాలని పురపాలిక అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, నీడీవో హేమలత పేర్కొన్నారు. గురువారం రామాయంపేటలో వీధులు, హోటళ్లు, డంపుయార్డులు, కూరగాయల మార్కెట్‌ను సందర్శించి మున్సిపాలిటీ అధికారులు, కమిషనర్, మేనేజర్, హోటల్ యజమానులకు సూచనలు సలహాలిచ్చారు. మున్సిపల్ సిబ్బంది ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లపై చెత్త వేసినా, ప్లాస్టిక్ విక్రయాలు జరిపినా కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించాలన్నారు. డంపుయార్డులో ఉన్న చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి వాటిని వర్మీ కంపోస్టు ఎరువులుగా మార్చాలన్నారు. చెత్తను సేకరించిన వారికే ఎరువులుగా తయారు చేసి వారినే విక్రయాలు జరిపే విధంగా అప్పగించాలన్నారు. పట్టణంలో హోటల్ యజమానులతో మాట్లాడారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పారవేయవద్దని, చెత్త బండిలోనే వేయాలన్నారు. కూరగాయలు విక్రయించేవారు రసాయనాలను వాడవద్దని, వాటితో ప్రజలు రోగాల బారిన పడుతారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్, సైదయ్య, పోచమ్మల శంకర్ తదితరులు ఉన్నారు.

నేడు దీక్షా దివస్

- సిద్దిపేట తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్ నాయకులు
- హాజరుకానున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సిద్దిపేట, నవంబర్ 28: సిద్దిపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సతీశ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్‌తో పాటు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లను నాయకులు పూర్తి చేశారు. సిద్దిపేటలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద గులాబీ తోరణాలతో అలంకరించారు.

కేసీఆర్ దీక్ష మద్దతుదారులకు సన్మానం

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పలుగుతండా వాసులు

నారాయణఖేడ్,నవంబర్ 28: కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా ఒకరోజు ముందు ఆమరణ దీక్ష చేపట్టిన నారాయణఖేడ్ మండలం పలుగు తండావాసులను గురువారం సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ సన్మానించి అభినందించారు. తండావాసుల తెగువను, కృషిని కొనియాడారు. ఉద్యమ సందర్భంలో కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఘనత పలుగుతండా వాసులకు దక్కుతుందన్నారు. పోలీసులు తండావాసులపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గకుండా పోరాటం చేశారన్నారు. ఉద్యమ సమయంలో సంగారెడ్డి జిల్లాలోనే పలుగు తండా ఉద్యమ స్ఫూర్తిని చాటిందని గుర్తు చేశారు.

అంబులెన్స్ కోసం సోనూసూద్‌కు వినతి

సోనుసూద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్

మద్దూరు (ధూళిమిట్ట), నవంబర్ 28: ధూళిమిట్ట మండలంలోని దుబ్బతండా పంచాయతీకి అంబులెన్స్ అందించాలని కోరుతూ సోనూసూద్‌ను హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో గురువారం దుబ్బతండా పంచాయతీ పరిధిలోని చెలిమె తండాకు చెందిన గిరిజన నాయకుడు రాజేశ్‌రాథోడ్ ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. దేశంలో కరోనా విపత్కర పరిస్థితుల్లో సోనూసూద్ అందించిన సేవలకు గుర్తుగా 2021లో చెలిమె తండాలో ఆయన విగ్రహాన్ని తండావాసులు ఏర్పాటు చేశారు. 2023లో చెలిమె తండాను సోనూసూద్ సందర్శించి, తండా అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ నేపథ్యంలో దుబ్బతండా చుట్టుపక్కల దవాఖానలు లేక వైద్యం కోసం సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నదని, ఈ సమయంలో రవాణా సౌకర్యాలు లేక ప్రాణాలు పోతున్నాయని, గిరిజనుల కోసం అంబులెన్స్ అందించాలని రాజేశ్‌రాథోడ్ సోనూసూద్‌ను కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే దుబ్బతండాకు అంబులెన్స్‌ను మంజూరు చేస్తానని హామీనిచ్చారు.

గురుకులాల్లో సౌకర్యాలు కల్పిస్తాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్